
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 9 ఆగస్టు 2024 | 5

నేటి నుంచి హర్ ఘర్ తిరంగా

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8: జిల్లాలో శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజల్లో దేశభక్తి భావన పెంపొందించాలన్నారు.దీనిలో భాగంగా జిల్లాలోని అధికారులు, సిబ్బందితో సహా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అర్ధరాత్రి..హాహాకారాలు

రేపు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు 7

కడియం పూల మార్కెట్‌కు కళ 8

నేటి నుంచి జల మిషన్ సర్వే

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 8: ఇంటింటా ఈ నెల 9నుంచి 13వ తేదీ వరకు జల మిషన్ సర్వే నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పారిశుధ్యం,తాగునీటి ఫిర్యాదులకు పంచాయితీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెం 1800-233-0544 తో ముంద్రించిన పోస్టరు కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఇంటికి సర్వే బృందాలు వెళ్లి ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందా, ట్యాప్ కనెక్షన్ ఉందా, వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారా అనే సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. శానిటేషన్ సర్వే సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణ తీరును శుక్రవారం రెండు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 66 చోట్ల ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్లు పనిచేయడం లేదని తక్షణం అవి పనిచేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఏ ముఖలింగం, డిపివో డి రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ డి బాలశంకరరావు, డిఆర్‌డిఏ పిడి ఎంవీవిఎస్ మూర్తి, డివిజనల్ పంచాయితీ అధికారి నాగలత తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు డీఎస్పీగా దేవకుమార్



కొవ్వూరు, ఆగస్టు 8: కొవ్వూరు డీఎస్పీగా జి. దేవకుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ వెయిటింగ్ లిస్టులో ఉన్న దేవకుమార్‌ను కొవ్వూరు డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు విడుదల చేశారు. కొవ్వూరు డీఎస్పీగా పనిచేసిన కె.చెంచురామారావును హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం సీసీఎస్ డీఎస్పీ కె. శ్రీనివాసమూర్తిని ఇన్‌చార్జిగా నియమించారు.ఇటీవల బదిలీల్లో శ్రీనివాసమూర్తిని బదిలీచేసి జి. దేవకుమార్‌ను కొవ్వూరు డీఎస్పీగా నియమించారు.

టీడీపీలో చేరిన బొమ్మన జయకుమార్

రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వస్త్రవ్యాపారి, జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కనకం నాగేశ్వరరావు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమక్షంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు.ఒకప్పుడు బొమ్మన కుటుంబం టీడీపీతోనే ఉండేది. అయితే దివంగత బొమ్మన రాజకుమార్ వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.ఆ తర్వాత ఈ కుటుంబం వైసీపీతోనే ఉంది.ప్రస్తుతం జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా బొమ్మన జయకుమార్ వ్యవహరిస్తున్నారు.ఈ నెల 25న బ్యాంక్ ఎన్నికలు జరగనున్నాయి.తిరిగి ఆయన ఛైర్మన్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన తండ్రి రాజకుమార్ మూడు దఫాలు జాంపేట బ్యాంక్ ఛైర్మన్‌గా వ్యవహరించారు.ఆయన అకాల మృతితో జయకుమార్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి ఆయనే ఛైర్మన్‌గా ఉన్నారు.

గోదారి గట్టుపై సెట్టుండాలి!

చెట్టును బతికించేందుకు పూజలు.. సందర్శించిన వంశీ

కొవ్వూరు,ఆగస్టు 8: సినిమా చెట్టును బతికించుకునేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.. కొవ్వూరు మండలం కుమారదేవంలో గత ఆదివారం గోదావరి గట్టుపై ఉండే సినిమాచెట్టు (నిద్రగన్నేరు) నేల కొరిగింది.ఈ చెట్టు కింద ఇప్పటి వరకూ సుమారు 300 వరకూ సినిమాలు తీశారు. దీంతో ఈ చెట్టుకు సినిమా చెట్టుగా పేరొచ్చింది.ఈ నేపథ్యంలో ఎక్కడెక్కడి నుంచో చెట్టును బతికించాలని విన్నపాలు రావడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఇదిలా ఉండగా సినీ దర్శకుడు వంశీ గురువారం పడిపోయిన చెట్టును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎలాగైనా బతికించాలని విజ్ఞప్తి చేశారు.రాజమహేంద్రవరం రోటరిక్లబ్ ఆఫ్ ఐకాన్ బృందం సభ్యులు చెట్టును బతికిస్తామని రంగంలోకి దిగారు. క్లబ్ సభ్యుడు ఇమ్మణి వెంకట్ మాట్లాడుతూ పడిపోయిన చెట్టు వేర్లు కట్‌చేసి స్పెషల్ ట్రీట్‌మెంటు చేస్తాం. ప్రకృతిపై ప్రేమతో పనులు చేపడుతున్నామన్నారు. సినిమాచెట్టును 45 నుంచి 60 రోజుల్లో శాస్త్రీయ విధానంలో నిలబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.ఈ మేరకు గురువారం చెట్టు వద్ద పూజలు చేశారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ కుమారదేవంలో పడిపోయిన చెట్టును శాస్త్రీయంగా ఆర్గానిక్ రసాయనాలతో మరలా నిలబెట్టి బతికిస్తామని రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ బృందం ముందుకు వచ్చిందన్నారు. 60 రోజుల్లో చెట్టును నిలబెడతామని తెలిపారన్నారు. కొవ్వూరు డివిజన్‌లో ఇంకా పెద్ద పెద్ద ఫేమస్ ట్రీలు ఉన్నాయని, వాటన్నింటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రోటరిక్లబ్ సభ్యులు దుర్గాప్రసాద్, క్లబ్ సెక్రటరి ఉదయగిరి సురేష్, జాయింట్ సెక్రటరీ వంశీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, కె.శేషగిరి, గొరిజాల సురేష్, వంకా వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



- వివరాలు మెయిన్‌లో..

నేలవాలిన సినిమా చెట్టు వద్ద గ్రామస్తులు



చెట్టు చూసేందుకు వచ్చిన సినీ దర్శకుడు వంశీ



కూటమికే ఓటు!

బడిలోనూ గెలిచారు..

- రసవత్తరంగా ఎస్ఎంసీ ఎన్నికలు
- కూటమి మద్దతుదారులదే పైచేయి
- జిల్లా వ్యాప్తంగా 989 పాఠశాలలు
- 968 స్కూల్స్‌లో ఎన్నికల నిర్వహణ
- 900 పాఠశాలల్లో ఏకగ్రీవం
- 10 స్కూల్స్‌లో వాయిదా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి జోరు తగ్గలేదు.. ఎక్కడా వెనకడుగు వేయలేదు.. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి జోరు కనిపించిందో..ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల్లోనూ అదే జోరు కనిపించింది.విజయపతాకం ఎగురవేసింది. జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ఓటర్లయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా ఓట్లు వేశారు. కొందరు కమిటీకి ఎన్నికయ్యారు. కేవలం కొద్ది చోట్ల మాత్రం స్పందన సరిగా లేదు. జిల్లాలో మొత్తం 989 స్కూళ్లు ఉండగా 968 చోట్ల ఎన్నికలు జరిగాయి. ఇందులో సుమారు 900 వరకూ ఏకగ్రీవమైనట్టు చెబుతున్నారు. ఇంకా పూర్తి సమాచారం రావలసి ఉంది. 10 స్కూళ్లలో క్వారమ్ లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. 11 ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాలు ఎన్నికలు వద్దని కోర్టుకు వెళ్లడం వల్ల అక్కడ నిలిచిపోయాయి. ప్రభుత్వం స్కూళ్ల అభివృద్ధి పై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో పాఠశాలల పనుల నిర్వహణలో తల్లిదండ్రుల పాత్ర ఉండేలా చేయడానికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకుంటున్నారు. ప్రతి స్కూల్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, మరో ఇద్దరు ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. మొదట పాఠశాలలో ప్రతి క్లాస్‌కు ఎన్నికలు జరుగుతాయి. విద్యార్థి తల్లిగాని, తండ్రికాని, సంరక్షకుడుగాని ఓటరుగా ఉంటారు. వీరు క్లాస్ కమిటీని ఎన్నుకుంటారు. తర్వాత అన్ని క్లాస్‌ల కమిటీ సభ్యులు కలసి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీని ఎన్నుకుంటారు. ఆయా సభ్యులంతా కలిసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. కమిటీలో ఎస్సీ, బీసీ, ఓసీ మూడు వర్గాల నుంచి సభ్యులు ఉంటారు. ఛైర్మన్ మహిళ అయితే, వైస్ ఛైర్మన్ పురుషుడు ఉంటారు. ఇలా ఒక పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ప్రతి స్కూల్‌లోనూ 50 శాతం ఓటర్ల కంటే ఎక్కువ వస్తే ఎన్నిక నిర్వహించారు. 10 చోట్ల 50 శాతం కంటే తక్కువ రావడంతో ఎన్నిక నిలిపివేశారు. స్కూల్ కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు.వారిలో ప్రధానోపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుడు, పాఠశాల పరిధిలోని వార్డు సభ్యుడు,అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు సభ్యులుగా ఉంటారు. ఇంకా ఆయా గ్రామాల్లో ఒక విద్యావేత్త, ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కూడా సభ్యుడిగా ఉంటారు. ఇలా జరిగిన ఎన్నికలు రసవత్తంగా జరిగాయి. కొందరు ముందుగానే పోటీ చేయడానికి రాగా..కొన్ని చోట్ల వచ్చిన వారిలోనే ఎంపిక చేసి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణకు పరిశీలకుడు వచ్చారు. కూటమి మద్దతుదారులే ఎన్నికవడం విశేషం.

మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయండి

వైద్య ఆరోగ్య శాఖ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 : మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకుపై కడుతున్న అదనపు నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతిపై ఏపీఎస్ఎంఐడీసీ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఫస్టియర్ చదువుతున్న మెడికోలు సెకండియర్‌లోకి వెళతారని, కౌన్సెలింగ్ పూర్తయితే త్వరలోనే మరో బ్యాచ్ ఫస్టియర్ మెడికోలు వస్తారని, దీనికి అనుగుణంగా కళాశాల,హాస్టల్ భవనాలు సిద్ధం చేయాలన్నారు. ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి,జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మెడికల్ కళాశాల పనులపై ఆరా తీస్తున్న కృష్ణబాబు

17 మంది తహశీల్దార్ల నియామకం

- ఉత్తర్వులు విడుదల చేసిన కలెక్టర్ ప్రశాంతి
- తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశం

రాజమహేంద్రవరం,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మండలాలకు తహశీల్దార్ల నియామకాలు పూర్తయ్యాయి. ఎన్నికల విధుల నిమిత్తం వేరే జిల్లాలకు వెళ్లిన తహశీల్దార్లు ఇటీవల రిలీవై ఇక్కడ రిపోర్టు చేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల కిందటే తహశీల్దార్ల నియామకం జరగాల్సి ఉంది. కానీ వరదలు, భారీ వర్షాల వల్ల ఇక్కడ విధుల్లో ఉన్నవారిని కదిపితే సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందనే కారణంతో ఆపారు. జిల్లాలో మొత్తం 17 మందిని నియమిస్తూ గురువారం రాత్రి కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా జీఎల్ఎస్.దేవి నియమితులయ్యారు. కలెక్టరేట్ ఏవోగా పీహెచ్‌జీఆర్ పాపారావు, రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయ ఏవోగా ఎం.సుజాత, కొవ్వూరు సబ్-కలెక్టర్ కార్యాలయ ఏవోగా జీఎస్ఎస్ జవహర్ బాజీ, కెఆర్ఆర్‌సీ స్పెషల్ తహశీల్దార్‌గా ఎం.రామకృష్ణ ,కలెక్టరేట్‌లో లాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఎం.మసూద్ అలీ నియమితులయ్యారు. ఇక బిక్కవోలు తహశీల్దార్‌గా డబ్ల్యుఎల్.రమణి, కోరుకొండ తహశీల్దార్‌గా వి.సుస్వాగతం, గోకవరం తహశీల్దార్‌గా వై.సరస్వతి, కడియం తహశీల్దార్‌గా కె.పోసిబాబు, రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్‌గా జేవీఆర్.రమేష్, చాగల్లు తహశీల్దార్‌గా మెరిపే మెరికమ్మ, నిడదవోలు తహశీల్దార్‌గా బి.నాగరాజునాయక్, పెరవలి తహశీల్దార్‌గా డి.అచ్యుత కుమారి, తాళ్లపూడి తహశీల్దార్ వి.రవీంద్రనాథ్, కొవ్వూరు తహశీల్దార్‌గా జి.కనకరాజు, ఉండ్రాజవరం తహశీల్దార్‌గా పీఎన్‌డీ.ప్రసాద్ నియమితులయ్యారు. తక్షణం వీరంతా విధుల్లో చేరవలసి ఉంది.

తల్లిపాలు తాగితే ఐక్యూ లెవెల్స్ అధికం

జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి

నిడదవోలు, ఆగస్టు 8 : తల్లిపాలు తాగిన పిల్లల్లో ఐక్యూ లెవల్స్ అధికంగా ఉంటాయని.. తల్లిపాల ద్వారా అన్ని పోషకాలు బిడ్డకు చేరుతాయని జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి అన్నారు. నిడదవోలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి బాలింత డబ్బా పాలను వదిలి తల్లిపాలు ఇవ్వాలన్నారు. డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టాలన్నారు. లయన్స్ జిల్లా సేవా కో ఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరరావు 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి బేతిన వెంకట రామన్, బండి రామ్‌గోపాల్, బండి వెంకటేశ్వరావు, జాస్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి పొగాకు సాగు వద్దు

పొగాకుబోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్

దేవరపల్లి/ గోపాలపురం, ఆగస్టు 8 : రైతులు పొగాకుబోర్డు పరిమితి మేరకే పంటపడించాలని పొగాకుబోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లి పొగాకుబోర్డులో పొగాకుపంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంట సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రపంచ పొగాకు మార్కెట్‌లో మన ప్రాంత పొగాకుకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ ఏడాది జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందని మన దేశంలో పొగాకుకు మంచి ధర పలికిందన్నారు. అనుకూలంగా ఉన్న నేలల్లోనే పంట వేయాలని రైతులకు సూచిం చారు.ప్రపంచంలో పొగాకు పంట నియంత్రణకు భారతదేశం కూడా ఒప్పంద సంతకం చేసిందని దాన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకు పంటను తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా రైతులు సాగు చేయాలన్నారు.కర్నాటకలో కూడా ఈ ఏడాది అధికంగా పొగాకు పంట వేశారని గుర్తు చేశారు.పొగాకు బోర్డు ఆర్ఎం పీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ బోర్డు పరిమితి కంటే ఎక్కువ పొగాకు సాగు చేస్తే రైతులపై చర్యలు తప్పవన్నారు. గోపాలపురంలోని పొగాకు బోర్డును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, రైతు సంఘం అధ్య క్షుడు ఇల్లూరి రాము తదితర రైతులు ఉన్నారు.

ముంచెత్తిన వాన



నీట మునిగిన కడియం ఆవ పొలాలు

మునిగిన చేలు

పల్లపు ప్రాంతాలు జలమయం

రాజమహేంద్రవరం రూరల్ , ఆగస్టు 8 : భారీ వర్షానికి పంట చేలు మునిగాయి. కడియం ఆవ ప్రాంతంలో రాజవోలు గ్రామం రైతులకు చెందిన సుమారు 350 ఎకరాల్లో వరిపంట ముంపునకు గురైంది. బొమ్మూరు, నామవరం హుకుంపేట, పాత బొమ్మూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు రాజవోలు మీదుగా కడియం ఆవ ప్రాంతంలో గల మురుగు కాలువ ద్వారా వెళుతుంది. కడియం మండలానికి చెందిన కొంత మంది మురుగునీరు వెళ్లకుండా డ్యామ్ వద్ద నిలిపివేయడంతో రాజవోలు గ్రామంలో వరి పంట మునిగిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కారవేదికలో అర్జీ పెట్టుకున్నామని రైతులు తెలిపారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే మురుగునీటి కాలువతో తమకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పంటను ముంపు బారి నుండి తప్పించేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీతానగరం..జలమయం

సీతానగరం, ఆగస్టు 8 : సీతానగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయంగా మారిపోయాయి. శెట్టిబలిజపేట ,సీతానగరం-పురుషోత్తపట్నం రోడ్డు, సీతానగరం పాత బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళే మార్గం ముంపునకు గురయ్యాయి. సీతానగరం బస్టాండ్ వద్దనున్న కుమ్మరి గొయ్యి నిండిపోయింది. ఆ గొయ్యిలోకి నీరు వెళ్లే అవకాశం లేక సమీపంలో ఉన్న శెట్టిబలిజపేట, పురుషోత్తపట్నం ప్రధాన రహదారి ముంపునకు గురయ్యాయి, పరిస్థితి గమనించిన కూటమి నాయకులు గురువారం హుటాహుటిన ఎక్స్‌కవేటర్ల సాయంతో పూడుకుపోయిన పాత తూరలు తొలగించి వెలమపేట వైపు నీరు మళ్లించారు.దీంతో వెలమపేట వైపున ఉన్న లేఅవుట్‌లోకి నీరు ప్రవేశించి అక్కడ ఇళ్లను మురుగునీరు చుట్టుముట్టింది. దీంతో ముంపునకు గురైన బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. శెట్టిబలిజ పేట వాసులు ఊపిరిపీల్చుకోగా వెలమపేటలో ముంపునకు గురైన బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాళ్ళపూడిలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8 : జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.గురువారం తెల్లవారుజాము 2 గంటల నుంచి ఉదయం 8:30 గంటల మధ్య జిల్లా వ్యాప్తంగా 1147.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా తాళ్ళపూడి మండలంలో 126.0 మి.మీ..అత్యల్పంగా పెరవలి మండలంలో 7.8 మి.మీ వర్షం పడింది.రాజమహేంద్రవరం డివిజన్ సీతానగరంలో 114.4మి.మీ, కోరుకొండ 90.4,రాజానగరం 82.4, గోకవరం 80.0, బిక్కవోలు 79.2, కడియం 78.2,రంగంపేట 77.4,రాజమహేంద్రవరం రూరల్ 69.2,అనపర్తి 66.8,రాజమహేంద్రవరం 62.2 మి.మీ వర్షపాతం నమోదైంది.కొవ్వూరు డివిజన్ గోపాలపురంలో 54.6 మి.మీ,కొవ్వూరు 40.4, నల్లజర్ల 35.4, దేవరపల్లి 32.0, చాగల్లు 24.4,నిడదవోలు 17.2,ఉండ్రాజవరం 9.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 60.4 శాతం వర్షం కురిసింది.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం,ఆగస్టు 8 : ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వర ద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పె రుగుతుంది.ధవళేశ్వరం వద్ద గురువారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 9.50 అడుగులుగా నమోదుకాగా 6,88,383 క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఇంద్రావతి పరీవాహకంలో కురిసిన వర్షాలతో పాటు తాలిపేరు ప్రాజెక్టు నుంచి వి డుదల చేసిన నీటితో భద్రాచలం వద్ద 38.40 అడుగుల వరకు చేరిన నీటిమట్టం తగ్గుతూ 37.30 అడుగులకు చేరుకుంది.

కొవ్వాడ కాల్వకు వరద పోటు..

గోపాలపురం, ఆగస్టు 8 : గత రెండురోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొవ్వాడ కాల్వకు వరద పోటెత్తింది. బుధవారం సాయంత్రానికే వరదనీరు ప్రవాహం దొండపూడి - సాగిపాడు గ్రామాల మధ్య కాజ్‌వేపైకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీస్,రెవెన్యూ అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో కొయ్యలగూడెం నుంచి పోలవరం వైపు గిరిజన గ్రామాలకు వెళ్లే వారందరికీ రాకపోకలు బంద్ అయ్యాయి. సుమారు 10 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.గురువారం ఉదయానికి ప్రవాహం ఉధృతమైంది. కొవ్వూరుపాడు, సాగిపాడు గ్రామాల మధ్య ఉన్న అల్లి కాల్వకు వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచి పోయాయి.



సీతానగరంలో నీట మునిగిన వీధి



సీతానగరం మెయిన్‌రోడ్డుపై నిలిచిన వాన నీరు



దొండపూడి - సాగిపాడు గ్రామాల మధ్య కాజ్‌వే పై కొవ్వాడ వరద నీరు

జ్యోతిర్మయి వ్రతాల నిర్వహణకు అనుమతి రద్దు

అన్నవరం, ఆగస్టు 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గతేడాది కార్తీక మాసంలో జ్యోతిర్మయి వ్రతాలకు అప్పట్లో దేవదాయ కమిషనర్ అనుమతులిచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కో టిక్కెట్టు రూ. 10,116గా నిర్ణయించి సుమారు 4 గంటల పాటు వ్రతం చేపట్టాల్సి ఉంది. అయితే దీనిపై పునఃపరిశీలన చేసి ఈ క్రతువు వ్యయప్రయాసలతో కూడుకున్నదని భక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో దేవదాయ కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్రతాలు నిర్వహించే మండపం కోసం అప్పట్లో ఖర్చు చేసిన సుమారు రూ.15 లక్షల వ్యయం బూడిదలో పోసిన పన్నీరైందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ముందుచూపు లేకుండా తీసుకునే నిర్ణయాలతో దేవస్థానం ఖజానాకు నష్టం చేకూరుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సత్యదేవునికి మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ పూజలు

అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుని ఏపీ మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



ధగధగాయమానం

సత్యదేవుడి ధ్వజస్తంభానికి స్వర్ణతాపడం పూర్తి

నేడు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రదక్షిణకు అనుమతి

అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ధ్వజస్తంభ స్వర్ణతాపడం అమరిక పనులను గురువారం ఉదయం ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన దాత రూ.3కోట్ల వ్యయంతో చేయించేందుకు ముందుకొచ్చారు. ఏప్రిల్ 22న నార్వేప కర్రతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచీ దీనికి సంబంధించి రాగి రేకు, దానిపై బంగారు పూత పనులు చేపట్టారు. 300 కిలోల రాగి రేకుపై రెండు కిలోల బంగారంతో స్వర్ణ తాపడం చేయించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పండితులు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేస్తారు. 10.20 గంటల నుంచి భక్తులకు బంగారు ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు అనుమతి ఇస్తారు. కార్యక్రమంలో దాత దంపతులు, ఇన్‌చార్జి ఈవో రమేష్‌బాబు పాల్గొంటారు.







ఆదివాసీల సంక్షేమం

ఎండమావేనా!

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు తద్వారా సంపన్న శ్రేణి మినహాయింపు ఆయా జాతుల అభివృద్ధి, సంక్షేమాలకు సూచికలు కాగలవేమో కానీ ఆదివాసీల మనుగడకు అవసరమైన హక్కులు, సాధికారతను కల్పించలేకపోతోంది. ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి బ్రిటిష్ కాలం నుంచీ ఎన్ని ప్రణాళికలు, శాసనాలు అమలవుతున్నా వారి జీవన ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వ పాలకులు, అధికారులే వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న వనరులపై వారికి సంపూర్ణ హక్కులు వారి మనుగడకు, వికాసానికి దోహదపడట్లేదు. ఒక్కోమారు వారికి ఉన్న హక్కులను ప్రభుత్వాలను నడిపించే పాలకులే హరించేస్తున్నారు. అభివృద్ధి ముసుగులో కొన్ని విధానాలు ఆదివాసీల ఉనికినే లేకుండా చేస్తున్నాయి. సంస్కృతీ, సంప్రదాయాలకు తిలోదకాలనిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల ఐక్యతను దెబ్బతీస్తూ, జాతి అంతానికే దారితీసే నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. ఆదివాసీ మహిళలకు కనీస ఆస్తి హక్కు కూడా గత 77 సంవత్సరాలుగా కలగలేదు. పాలకులు ఎవరు మారినా అధికార యంత్రాంగం తీరులో మార్పు లేకపోవడంతో ఆదివాసీ సంక్షేమం ఎండమావిగానే ఉంది

వారి మనుగడకు వర్గీకరణకు మించిన సాధికారత కావాలి

హక్కుల రక్షణను విస్మరించిన పాలకులతో తిరోగమనంలో జీవనం

(రంపచోడవరం)

ఆదివాసీల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని కాలంలో ఎంతో ఆదర్శప్రాయమైన జీవనాన్ని సాగించిన గిరిజన జాతులు నేడు ఎన్నో, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అడవిని నమ్ముకుని జీవనం సాగించే వీరికి నేటికీ అటవీ హక్కులు పూర్తిస్థాయిలో దక్కలేదు. కానీ ఆదివాసీలకు చెందాల్సిన వనరులను వారి ప్రమేయం లేకుండా అమ్ముకుని, ఖనిజాలు దోచేసే వ్యవస్థలకు ప్రోత్సాహం ఎక్కువైంది. విధాన లోపం, అమలు చేసేవారిలో చిత్తశుద్ధి లోపం గిరిజనులకు శాపంగా మారింది. ఇక్కడి వనరుల ఆధారంగా జరిగే వాణిజ్య వ్యవహారాల్లో ఆదివాసీలను భాగస్వాములుగా చేసి వారికి కూడా ఆర్థికాభివృద్ధి సాధించిపెట్టే వ్యూహాలు అమలుకు నోచుకోవట్లేదు. ఆహార, ఆరోగ్య భద్రతలు మృగ్యమయ్యాయి. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే సుమారు 420 ఆవాసాలకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు పొందే అవకాశం లేదు. సుమారు 502 ఆవాసాలకు సరైన రహదారి బంధాలు లేవు. ఈ జిల్లాలో మూడు ఐటీడీఏలు ఏర్పాట చేసిన లక్ష్యం నీరుగారి నిర్దేశించిన ఆశయాల్లో గత 48 సంవత్సరాలుగా ఏ ఒక్క దానినీ అవి సాధించకపోగా అవినీతికి నిలయాలుగా మారాయి. గిరిజనుల పేరుతో చేపట్టాల్సిన పథకాలను, కార్యక్రమాలను అధికారులు, రాజకీయ నాయకులు తమ జేబులు నింపుకునే కార్యక్రమాలుగా మార్చారు. ఎన్ని విచారణలు జరిగి, ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు అందినా బాధ్యులపై చర్యలు మృగ్యమే! దీంతో గిరిజన ప్రాంతం అవినీతిపరులకు అడ్డాగా మారింది. గిరిజనాభివృద్ధిని నిర్దేశించే సమావేశాలు మూడేళ్లుగా ఐటీడీఏల్లో జరగడం లేదు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో రాజకీయ చైతన్యం అంతగా లేకపోవడంతో బ్యూరోక్రాట్లే పెత్తనం సాగిస్తూ గిరిజన మనుగడను దెబ్బతీస్తున్నారు. గిరిజనులను భాగస్వామ్యం చేసి ప్రణాళికలను రూపొందించాలన్న అంశాన్నే విస్మరించారు. ఐటీడీఏలో మెజారిటీ సభ్యులందరూ అధికారులే కావడం విశేషం. జవాబుదారీతనం కలిగిన వ్యవస్థగా గిరిజనుడే ఛైర్మన్‌గా, పెద్ద సంఖ్యలో గిరిజనులే సభ్యులుగా ఐటీడీఏను రూపొందించం ద్వారా గిరిజనుల్లో నాయకత్వ లక్షణాలు పెరిగి ఈ ప్రాంత ప్రయోజనాల రక్షణకు వీలుంటుంది.

జలాలను సద్వినియోగపర్చే దిశగా సాగాల్సిన జలయజ్ఞాలు ధనయజ్ఞాలుగా మారి గిరిజన ప్రయోజనాలను దెబ్బతీసిన పరిస్థితులు అందరికీ తెలిసినవే! ఇక పోలవరం లాంటి మెగా ప్రాజెక్టు విషయంలో గత రెండు దశాబ్దాలుగా సరైన పునరావాస విధానాన్ని ప్రభుత్వాలు చేపట్టకపోవడంతో ఒక్క అల్లూరి జిల్లాలోనే సుమారు 236 ఆవాసాల గిరిజనుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలలో ఆదివాసీలకు ఉన్న అటవీ హక్కులను పరిరక్షించాలని కేంద్రం గతంలోనే ఆదేశించినా ఇప్పటికీ అటవీ హక్కులు వారికి దక్కలేదు. ప్రాజెక్టు కారణంగా ఆదిమజాతిలో ముఖ్యమైన కొండరెడ్లు అధికంగా ఉండే గోదావరి తీర గ్రామాల నుంచి వారిని తొలగించేందుకు రంగం సిద్ధమైంది.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఇక ఆదివాసీలు సాధికారత సాధించే దిశగా తీసుకుంటున్న చర్యలే ఎక్కడా కనిపించట్లేదు. 73వ రాజ్యాంగ సవరణలోని అంశాలకు ఈ ప్రాంతంలోని అధికారులు విలువ ఇవ్వట్లేదు. అధికారులు తీసుకునే ఏ నిర్ణయం కూడా పీసా చట్టం కింద సాగడం లేదు. గిరిజన మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించే దిశగా కూడా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజన కుటుంబాల మధ్య ఆస్తి హక్కుల విషయాల్లో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులోనైనా ప్రభుత్వాలు గిరిజన సాధికారిత కోసం చర్యలు తీసుకుని, వారి మనుగడ కోసం కృషి చేస్తాయేమో చూడాలి.



అర్ధరాత్రి హాహాకారాలు

దివాన్‌చెరువు హైవేపై అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికులు సురక్షితం

రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైవేపై దూసుకుపోతోంది.. సరిగ్గా అర్ధరాత్రి 1.30 సమయం.. వర్షం కురుస్తోంది.. దాదాపుగా అందరూ గాఢ నిద్రలో ఉన్నారు.. ఈలోపు పెద్ద కుదుపు.. బస్సు అదుపు తప్పింది.. ప్రయాణికుల హాహాకారాలు.. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కేవీఆర్ ట్రావెల్స్‌కి చెందిన బస్సు గుంటూరు నుంచి పాలకొండ వెళ్తోంది. వర్షం పడుతుండడంతో రోడ్డు చిత్తడిగా మారింది. దివాన్‌చెరువు సమీపంలో హైవేపైకి చేరే మలుపు వద్ద బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు తుప్పల్లోకి వెళ్లింది. డ్రైవరు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వి.వినయ్‌మోహన్, ప్రకాశ్‌నగర్ ఎస్‌ఐ శివప్రసాద్, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. కేవీఆర్ ట్రావెల్స్ స్థానిక కార్యాలయం నుంచి కూడా సిబ్బంది వచ్చారు. 40మంది ప్రయాణికులను జాగ్రత్తగా కిందికి దింపి వేరే బస్సులో పంపించారు.

విజిలెన్స్ దాడుల్లో 33.27 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

పిఠాపురం, ఆగస్టు 8: కాకినాడ పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని బొజ్జావారితోట ఏరియాలో పాడుబడి వినియోగంలో లేని ఇంటిలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. అక్కడ 65 బస్తాల్లో ఉన్న 33.27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఊటా బుల్లిరాజుపై పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ రూ.1.54లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ టి.జగన్నాథరెడ్డి, ఏవో జి.భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, పీసీలు జీవీఎస్ లోవరాజు, కె.వీరబాబు, సివిల్ సప్లయిస్ డీటీ వీరాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు జరిపినా, అక్రమంగా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

శతాధిక వృద్ధుడి మృతి



పెరవలి, ఆగస్టు 8: తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉప్పలపాటి సుబ్బారావు (102) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య రామలక్ష్మి, ఒక కుమారుడు సత్తిరాజు, నలుగురు కుమార్తెలు, 11 మంది మనుమలు, 18 మంది మునిమనుమలు ఉన్నారు. గ్రామానికి మంచినీటి సౌకర్యం లేని రోజుల్లో సుబ్బారావు చెరువును తవ్వించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారని గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ, జనసేన నాయకులు సంతాపం తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దుపై ప్రయాణికుల అసహనం

సామర్లకోట, ఆగస్టు 8: విశాఖ-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు అర్ధంతరంగా ప్రకటించడంతో సాధారణ ప్రయాణికులతో పాటు తిరుపతి వెళ్లేందుకు ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రిజర్వేషన్ టిక్కెట్లకు సొమ్ము రిఫండ్ పొందేందుకు సరియైన సమాచారం చెప్పే రైల్వే అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా రిజర్వేషన్ టిక్కెట్లకు సంబంధించిన సొమ్మును వెనక్కి ఇస్తామని చెప్పారు.

గంజాయి సమాచారం ఇస్తే రూ.5వేలు రివార్డు

మంత్రి సుభాష్ ప్రకటన

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 8: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గంజాయి సరఫరా, వినియోగించే వారి సమాచారం ఇస్తే వారికి రూ.5వేలు ఇస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. పరిశ్రమలు, కళాశాలలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి అమ్మేవారు, తాగేవారి వివరాలను తనకు గానీ, పోలీసులకు గానీ తెలియజేసే వారికి నగదు రివార్డు ఇస్తామన్నారు. సమాచారం ఇచ్చిన లేదా పట్టిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

మలికిపురం, ఆగస్టు 8: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న అప్పనరామునిలంకకు చెందిన మిరియాల బన్నును గురువారం మలికిపురం మసీదు రోడ్డులో అరెస్టు చేసి కోర్టుకు పంపినట్టు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి చెందిన దూడ, జంతువు పాదముద్రలు

గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడ మృతి

గండేపల్లి, ఆగస్టు 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వల్లభశెట్టి సత్తిబాబుకి ఎన్టీ రాజాపురం సమీపంలో దూళ్ల సావిడి వుంది. అతడు గురువారం ఉదయాన్నే పాలు తీసుకుని తిరిగి వచ్చేసరికి చనిపోయి సగం తినేసి ఉన్న దూడను చూసి భయపడ్డాడు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలపగా ఫారెస్టు ఆఫీసరు పాలకు శశికుమార్ వచ్చి పాదముద్రలు గుర్తించారు. వీటిని ఉన్నతాధికారులకు పంపిస్తామని, ఏ జంతువో చెప్పలేమన్నారు. రేసు కుక్కలు లేదా చిరుత అయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో కొంతకాలం క్రితం మల్లేపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి బుల్లబ్బాయి లేగదూడను గుర్తు తెలియని జంతువు ఇదే మాదిరిగా తినేయడంతో పాటు ఒక గేదెపై దాడి చేసిన సంఘటనలున్నాయి. అప్పట్లో అటవీ శాఖాధికారులు అందుకు కారణం రేసు కుక్కలు అయి ఉండవచ్చని భావించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 8: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి కంబాలచెరువు వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఇద్దరు పిల్లలు దాటినా 'స్థానిక' ఎన్నికల్లో పోటీచేయొచ్చు

ప్రభుత్వ నిర్ణయంతో మన్యంలో హర్షాతిరేకాలు

రంపచోడవరం, ఆగస్టు 8: ఇక ఎందరు పిల్లలున్నా స్థానిక సంస్థలైన పంచాయతీరాజ్ ఎన్నికల్లో దర్జాగా పోటీ చేసేందుకు వీలు కల్పిస్తూ చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై మన్యంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు పిల్లల అనర్హత క్లాజు గిరిజన నాయకులు బాగా ఇబ్బందిపడ్డారు. వీరిలో ఆచారంగా వస్తున్న బహుభార్యత్వం కారణంగా ఆయా నాయకులకు ఉన్న పలు భార్యల ద్వారా కలిగిన ఇద్దరికి మించిన సంతానానికి ఆయనే తండ్రిగా ఉండడంతో పోటీకి అర్హత లేకుండా పోయింది. అంతే కాకుండా 1979లో కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు గిరిజన ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణకు అవకాశం లేదు. ఈ కారణంగా కూడా గిరిజనులు ఎక్కువ సంతానానికి జన్మనిచ్చేవారు. ఇలాంటి అనేక కారణాలతో 1994లో వచ్చిన పంచాయతీరాజ్ చట్టం గిరిజనులను అధిక సంతానం కారణంతో అనర్హులుగా ఎన్నికలకు దూరం చేసింది. దీనిపై గత మూడు దశాబ్దాలుగా ఎన్ని పోరాటాలు చేసి, ఎన్ని ప్రభుత్వాల చుట్టూ తిరిగినా ఈ అంశంలో మార్పు రాలేదు. కానీ ఎట్టకేలకు ఎన్నికల ముందు ఈ అంశం టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి చేరడంతో ఆయన చట్ట సవరణ ద్వారా సదరు ఇద్దరు పిల్లల క్లాజును తొలగించేందుకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా గిరిజనుల్లో ఇది ఎక్కువ ఉత్సాహాన్ని కలిగిస్తోంది. అందునా శుక్రవారం ఆదివాసీ దినోత్సవం కావడంతో చంద్రబాబు నిర్ణయం వారికి కానుక అయ్యింది.

ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే పోటీకి అనర్హత నిబంధనను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై టీడీపీకి చెందిన రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా ఎవరూ తీర్చని ఈ సమస్యకు పరిష్కారం చూపిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం గిరిజనులకు ఎంతో మేలు చేస్తుందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ అన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా రాబోయే ఎన్నికల్లో అమలులోకి వస్తుందన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న నేతలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.




నాటు పడవ, అంబులెన్సుల్లో గర్భిణులను తరలిస్తున్న దృశ్యం

పెరుగుతున్న వరద

ఆసుపత్రులకు గర్భిణుల తరలింపు

చింతూరు, ఆగస్టు 8: మండలంలో వరద ఉధృతి గురువారం ఉదయం మళ్లీ పెరిగింది. దీంతో సోకిలేరు, చీకటివాగు, కుయుగూరు వాగుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రధాన రహదారులపై నీరు చేరడంతో చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే దశలో ఎజికోడేరు, రామన్నపాలెం, ముకునూరు, చదలవాడ, పెద్దసీతనపల్లి పంచాయతీల పరిధి లోని 16 గ్రామాలకు రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. కాగా లోతట్టు ప్రాంతాలకు చెందిన గర్భిణులను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చింతూరు సీహెచ్‌సీకి తరలిస్తున్నారు. ముంపునకు గురైన రహదారులపై నాటు పడవలను వినియోగించి అక్కడి నుంచి అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారు.

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలి

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన టీడీపీ నేత మల్లికార్జునరావు



వరరామచంద్రాపురం, అగస్టు 8: వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును టీడీపీ మండల నాయకుడు, మాజీ ఎంపీపీ జంగాల మల్లికార్జునరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రతిఏటా వచ్చే గోదావరి వరదలతో ముంపు మండలాల ప్రజలు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవలి వరదలకు కొన్ని గ్రామాలు నీట మునగడంతో చంటి పిల్లలతో పునరావాస కేంద్రాల్లో చిమ్మచీకట్లో దాదాపు పది రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపారన్నారు. పోలవరం నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇచ్చి కాపాడాలని కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

చింతూరు, ఆగస్టు 8: చింతూరు డివిజన్ పరిధిలో వైద్య శాఖ ఇంటింటా సర్వే చేపట్టింది. గురువారం మొదలైన ఈ సర్వే మూడు రోజులు జరుగుతుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు చిన్నారులు వ్యాధి బారిన పడి మృతి చెందిన విషయం విదితమే. దీంతో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఇంటింటా సర్వే చేపట్టాల్సిందిగా వైద్య శాఖను ఆదేశించారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని 2,400 మంది చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీసి వైద్య పరీక్షలు చేస్తున్నారు. సర్వేలో 139 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వీరంతా తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఆరా తీసి వివరాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపిస్తున్నారు.

బస్టాండుకు వెలుగులు



చింతూరు, ఆగస్టు 8: ఆలనా పాలనా లేక చింతూరు బస్టాండు దాదాపు మూడేళ్లుగా చీకట్లో మగ్గుతోంది. దీంతో రాత్రి సమయంలో ప్రయాణికులు దోమలతో అవస్థలు పడేవారు. కాగా గురువారం చింతూరుకు చెందిన యువకులు మల్లిపూడి సతీష్, వీరబోయిన రాజకుమార్, షాహిద్ వెంకన్న సమీర్ బస్టాండు దుస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన ఆయన చర్యలకు ఆదేశించడంతో గురువారం రాత్రి చింతూరు బస్టాండు విద్యుద్దీపాలతో కళకళలాడింది.

'బియ్యం స్మగ్లర్లపై చర్యలు తీసుకోండి'

కూనవరం, ఆగస్టు 8: వరద సాయంగా వచ్చిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నారని కూటమి నాయకులు ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో అధిక ధర చెల్లించి బియ్యాన్ని కొనుగోలు చేసి చింతూరు కేంద్రంగా తరలిస్తున్నారన్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని స్మగ్లర్లు అధిక ధరకు కొని మరోచోటకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు, ఉమామహేశ్వరరావు, హెచ్.రాము, జనసేన నాయకులు సాంబశివరావు, సర్పంచ్ హేమంత్, దాసరి నరేంద్ర, వెంకట్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

మోతుగూడెం, ఆగస్టు 8: డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లారావు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం వీఎస్ఆర్ రూరల్ మీడియా కళాకారులు మోతుగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ప్రజ్ఞ, నఫియా సుల్తాన్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్లో జానపద గీతాలు, హాస్యవల్లరి, నాటికలతో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు. సికిల్‌సెల్, ఎనీమియా లక్షణాలను వివరించి రక్త పరీక్ష ద్వారా ఈ వ్యాధులను నిర్ధారించవచ్చన్నారు. ఆరోగ్య సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అడవుల కార్పొరేటీకరణను ప్రతిఘటించాలి'

దేవీపట్నం, ఆగస్టు 8: మండలంలోని గంగవరంలో గురువారం ఆదివాసీ సదస్సు నిర్వహించారు. ఏఐకేఎంఎస్ రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బచ్చల సునీత, కోండ్ల కండంరెడ్డి పాల్గొన్నారు.



బిక్కవోలు హైస్కూల్లో ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు



రంగంపేట హైస్కూల్లో ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు



కడియం హైస్కూల్లో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ



రాజమహేంద్రవరంలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డీఐ దిలీప్‌కుమార్

ఎస్ఎంసీలు కూటమి కైవసం

- పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు
- కూటమి అభ్యర్థులే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నిక

బిక్కవోలు, ఆగస్టు 8: ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి సభ్యులు ఘన విజయం సాధించారు. పలు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. బిక్కవోలు మండలంలోని 30 ప్రాథమిక, 1 ప్రాథమికోన్నత, 8 జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిపామని ఎంఈవోలు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రతి పాఠశాలలోను ఎస్ఎంసీ సభ్యులతో పాటు వారిలోంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారని తెలిపారు. వీరితో పాటు హెచ్.ఎం, ఉపాధ్యాయుడు, వార్డు మెంబరు, అంగన్వాడీ వర్కర్, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య ప్రెసిడెంట్లతో ఎక్స్ అఫీషియో సభ్యులను, విద్యావేత్త, స్వచ్ఛంద సంస్థ నుంచి కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. వీరందరూ రెండేళ్లు ఈ పదవుల్లో కొనసాగుతారని తెలిపారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల నుంచి చైర్మన్‌గా కొల్లి వీరబాబు, వైస్ చైర్మన్‌గా వైభాగుల వీరలక్ష్మి, కొ-ఆప్షన్ సభ్యులుగా వానపల్లి శ్రీనివాసరావు, వైదాడి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని హెచ్‌ఎం పి.వీరప్రభాకరరావు తెలిపారు. ఊలపల్లి హైస్కూల్ చైర్మన్‌గా కట్టా వెంకటరమణ, కొంకుదురు హైస్కూల్ చైర్మన్‌గా లంకి వరలక్ష్మి ఎన్నికయ్యారని ఆయా హెచ్‌ఎంలు కొవ్వూరి అమ్మిరెడ్డి, మల్లిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికైన వారిని కూటమి నాయకులు గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.

రంగంపేట: మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలలకు గాను 47 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయని, కమిటీ సభ్యులను, చైర్మన్లను, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్టు ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. సభ్యులతో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారన్నారు. వడిశలేరు హైస్కూల్లో కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదావేశామన్నారు.

కడియం: మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి కడియం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఎంఈవో వై.నాగేశ్వరరావు ఎన్నికల పరిశీలకులుగా నిర్వహించిన ఎన్నికలో చైర్‌పర్సన్‌గా గారపాటి సత్య, వైస్ చైర్మన్‌గా నరమామిడి విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఉపసర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని 34 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 7 జడ్పీ ఉన్నత, 2 గురుకుల పాఠశాల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయని, ఆయా పాఠశాలల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్టు మండల విద్యాశాఖాధికారిణి బి.గౌరమ్మ తెలిపారు.

రాజానగరం: మండలంలో 61 ప్రభుత్వ పాఠశాలలకు గాను నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా మిగిలిన అన్ని పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చేతులెత్తే విధానం ద్వారా ఎన్నికలు నిర్వహించినట్టు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. పాఠశాలల్లో కేటగిరీల వారీగా 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులను ఎంపిక చేసి రిజర్వేషన్ ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారన్నారు. అయితే అన్ని పాఠశాలల్లో కూటమి విజయం సాధించేలా ఆయా గ్రామాల్లోని కూటమి నాయకులు విశేష కృషి చేశారు. ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన యాజమాన్య కమిటీలో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను కూటమి నాయకులు సత్కరించారు.

సీతానగరం: మండలంలోని 57 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో స్వామినాయక్ తెలిపారు. సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా పొట్నూరి భువనేశ్వరి, వైస్ చైర్‌పర్సన్‌గా వీరిగాని పద్మ ఎన్నికయినట్టు తెలిపారు. నూతన కమిటీలకు పలు సూచలను అందించామన్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కోరుకొండ: మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలకు గాను 43 పాఠశాల్లో ఏకగ్రీవంగా కాగా 11 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని ఎంఈవోలు పి.కుశలవ దొర, ఎం.సుజాత తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో 1000 మంది విద్యార్థులు చదువుతున్న కోరుకొండ హైస్కూల్లో కోరం లేకపోవడంతో ఎన్నిక ఆగిపోయింది. అంతకుముందు విద్యాకమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు ఉపాధ్యాయులు, అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇరువర్గాలు పోటీకి సిద్ధపడ్డారు. ఒక దశలో వాదోపవాదాలు, తోపులాట జరిగాయి. పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మధ్యాహ్నం 1గంట సమయానికి కూడా కోరం లేకపోవడం, ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్టు హెచ్‌ఎం మణికుమార్ ప్రకటించారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు పూర్తి చేశారు. శ్రీనాగరాజా ప్రాథమిక పాఠశాల ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా ఆర్.వెంకట సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్.రమ్య ఎన్నికయ్యారు. కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా వై.రాజశేఖర్‌రావు, వైస్ చైర్‌పర్సన్‌గా డి.దేవి ఎన్నికయారు. కంటిపూడి రామారావు ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా కొమ్ము ఊర్మిళ, వైస్ చైర్‌పర్సన్‌గా కొమ్మన శైలజ ఎన్నికయ్యారు. లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా కె.రమేష్, వైస్ చైర్‌పర్సన్‌గా టి.కమల చందన ఎన్నికయ్యారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మోటూరి మంగరాణి, పులగుర్త దుర్గాప్రసాద్, మొండ్రేటి నరేష్, ఎ.మల్లేశ్వరరావు ఉపాధ్యాయులు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. నూతన చైర్మన్లతో డీఐ దిలీప్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. అర్బన్ రేంజ్‌లో 74 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

అనపర్తి: మండలంలోని ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి పర్యవేక్షణలో 10 జడ్పీ ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 31 ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఎల్ఎన్ పురం రెసిడెన్షియల్ పాఠశాల చైర్మన్‌గా కర్రి రాజారావు, వైఎస్ చైర్మన్‌గా సురకాసుల దేవి, అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మల్లిడి పార్వతి, వైఎస్ చైర్మన్‌గా టేకుమూడి రాజేశ్వరి, బాలికల ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎన్.విజయలక్ష్మి, వైఎస్ చైర్మన్‌గా టి.కవిత, కేపీఆర్ పాఠశాల చైర్మన్‌గా టి.రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా పి.ఎల్లారీశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. నూతన కమిటీలతో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ప్రమాణం చేయించారు. లక్ష్మీనరసాపురం రెసిడెన్సియల్ పాఠశాల ఎన్నికలకు హాజరైన టీడీపీ నాయకులు చైర్మన్ వైఎస్ చైర్మన్‌నలను అభినందించారు. ఎన్నికల ప్రక్రియలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల ఘన విజయం: చంటిబాబు

దివాన్‌చెరువు, ఆగస్టు 8: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో రాజానగరం మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన పాఠశాలల్లో తమ అభ్యర్థులే విజయం సాధించే విధంగా కూటమి పార్టీలు నాయకులు, కార్యకర్తలు ఒకే అభిప్రాయంతో ముందుకు సాగారని చెప్పారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీలు ఆయా పాఠశాలల అభివృద్ధికి, మధ్యాహ్నభోజన పథకం వంటి వాటి ద్వారా విద్యార్థులకు మరింత మేలు జరిగేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని చంటిబాబు సూచించారు.



భూపతిపాలెం గురుకులంలో ఎన్నికైన కమిటీ సభ్యులు



చక్రద్వారబంధం హైస్కూల్లో ఎన్నికైన కమిటీ సభ్యులు

పాపను ఇప్పించండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- తూర్పుగోనగూడెంలో విచారణ చేపట్టిన అధికారులు



తూర్పుగోనగూడెం సచివాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

రాజానగరం, ఆగస్టు 8: నవ మాసాలు మోసి ప్రసవించిన తన బిడ్డను తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలో ఆలస్యంగా వెలుగు చూసింది. 2019లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ పీడీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొర్రపు ఆదిలక్ష్మి 2019 అక్టోబరు 30న రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఆడ శిశువును ప్రసవించింది. ఆసుపత్రిలో ఉండగా వారం రోజుల అనంతరం తన భర్త అప్పారావుకు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగించి తన బిడ్డను తీసుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయబోతే స్వీకరించలేదని బాధిత మహిళ వాపోయింది. ఈ విషయమై తనకు ప్రసవం చేసిన వైద్య సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదన్నారు. దీనిపై భర్త అప్పారావు మాట్లాడుతూ పాపను పెంచుకోలేరని, తమకు ఇస్తే కొంత నగదు ముట్టచెబుతామని చెప్పడంతో మద్యం మత్తులో తన పాపను వారికి అప్పగించినట్టు చెప్పాడు. పాపను తిరిగి తీసురమ్మని తన భార్య ఒత్తిడి తీసుకురాడమే కాకుండా పోలీసు కేసు పెడతానని బెదిరించడంతో భయపడి ఊరు వదిలి వెళ్లిపోయానని, ఏడాది అనంతరం పోలీసులు ఎవరూ రావడం లేదని తెలుసుకుని తిరిగి ఇంటికి చేరుకున్నట్టు చెప్పాడు. తన పాపను కష్టపడి పెంచుకుంటామని ఇప్పుడు ఎలాగైనా తిరిగి తమకు అప్పగించాలని ఆదిలక్ష్మి, అప్పారావు విలపించారు. ఈ విషయమై విచారణాధికారిణి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారిని విలేకరులు ప్రశ్నించగా ఈ సంఘటనకు సంబంధించి బాధితుల నుంచి సమగ్ర సమాచారం సేకరించామని, కలెక్టర్‌కు నివేదిస్తామని బదులిచ్చారు. అయితే విచారణాధికారుల ఆదేశాల మేరకు బాధితులు గురువారం రాత్రి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ విచారణలో డిప్యూటీ తహశీల్దార్ సునీత, ఏఎస్ఐ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

పూలమార్కెట్‌కు కళ

మల్లెలు కిలో రూ.1600, చామంతి రూ.300



కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్

కడియం, ఆగస్టు 8: నిన్నటి వరకు మూఢం... అంతంత మాత్రంగా పూల ధరలు. ప్రస్తుతం శ్రావణమాసం అందులోను శుక్రవారం. మరో వైపు వివాహ ముహూర్తాలు ఉండడంతో పూలమార్కెట్‌కు కళ వచ్చింది. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌లో రైతులు, వ్యాపారులు, కొనుగోలు దారులతో బిజీగా మారింది. శ్రావణ శుక్రవారం రోజు అమ్మవారికి పసుపు రంగు చామంతి పూలతో మహిళలు పూజలు చేస్తారు. ఈ పూలను ఈ సీజన్‌లో బెంగుళూరు, మద్రాసు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. సుమారు అక్టోబరు నవంబరు మాసాల వరకు చామంతిపూలు మాత్రం ఇతర ప్రాంతాల నుంచే దిగుమతి చేసుకుంటారు.

పూలధరలు (కిలో)..

చామంతి: రూ.250-రూ.300
నీలం చామంతి: రూ. 250
బంతి:రూ. 70-రూ. 80
లిల్లీ: రూ.350
కాగడాలు: రూ.800
జాజులు: రూ.1,100
మల్లెలు: రూ.1,600
కనకంబరం (1-బారు) రూ.450
స్టార్‌గులాబీ: రూ.150-రూ.170

వరలక్ష్మి రూపుల అందజేత

కోరుకొండ, ఆగస్టు 8: మండలంలోని శ్రీరంగపట్నంలో ఏర్పాటు చేసిన బంగారు వరలక్ష్మి కానుక-2 లక్కీ డ్రా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ నెల 1న నుంచి 5వ తేదీ వరకు 5రోజులు పాటు నిర్వహించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో 2020 మంది మహిళలు పేర్లను నమోదు చేసుకున్నారు. వారి నుంచి లక్కీడ్రా ద్వారా 50 మంది విజేతలను ప్రకటించారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.7,500 విలువై ఒక గ్రాము వరలక్ష్మి రూపును ఉచితంగా అందజేశారు. అలాగే ప్రశంసాపత్రాలు అందించారు. విశ్వ హిందూ పరిషత్ రామసేన అధ్యక్షుడు కంబాల పాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, సర్పంచ్ మద్దాల అమ్మాజీ, మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

రంగంపేట, ఆగస్టు 8: తల్లిపాలు అమృతంతో సమానమని రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముర్రిపాలు ఆవశ్యకత, దానిలోని పోషక విలువలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు సంకీర్తన, చిన్నారావు, సీహెచ్‌వో కె.జయమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందాలి

పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 14న నిర్వహిస్తామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఈ మారు అధిక సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులు పరిష్కారం కావాలని, బాధితులకు పరిహారం అందాలని ఆదేశించారు. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులతో ఆమె సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న వాహన ప్రమాద కేసులను గుర్తించి ఆ జాబితా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలకు అందజేయాలన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 14మంది అరెస్టు

గోకవరం, ఆగస్టు 8: మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై గురువారం పోలీసులు దాడిచేసి 14మందిని అరెస్ట్ చేశారు. గుమ్మళ్లదొడ్డిలో దాడిచేసి 8మందిని అరెస్ట్ చేయడంతో పాటు రూ.76,500 నగదును, 2సెట్ల ప్లేకార్డ్సను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. అలాగే కొత్తపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,450 నగదును, రెండు సెట్ల ప్లేకార్డ్సను స్వాధీనం చేసుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యాశాఖ తీరుపై కమిషనర్‌కు ఫిర్యాదు

కడియం, ఆగస్టు 8: కడియం మండల విద్యాశాఖ తీరుపై విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి వెంకటరామారావు(రాంజీ) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఎంపీపీకి, సర్పంచ్‌కు, ప్రజాప్రతినిధులకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఎన్నికలు జరపాలంటూ 6 పేజీల కాపీలో స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై ఎంఈవోలకు ఫోను చేసినా వారు స్పందించక పోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఉపవిద్యాశాఖాధికారికి ఫోన్ చేశానన్నారు. విద్యాశాఖ తీరుపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు రాంజీ తెలిపారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

రంగంపేట, ఆగస్టు 8: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో జె.జెస్సీఫ్లోరెన్స్, ప్రజ్వల కోఆర్డినేటర్ టి.శ్రావ్యశృతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు ఉద్యోగం, సినిమా అవకాశాల మోసపోయి విదేశాలకు రవాణా అవున్నారన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించి రక్షించాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని అవగాహన కలిగించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

దివాన్‌చెరువు, ఆగస్టు 8: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలదొర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్ణయం మేరకు 30 ఏళ్లుగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. దేశంలోని ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఆగస్టు 9న ప్రభుత్వ సెలవు దినంగా అమలు అవుతోందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో కూడా సెలవుగా ప్రకటించాలని రెండు ప్రభుత్వాలను తాము కోరుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకు మాత్రమే ఉద్యోగాలు కల్పించాలన్న జీవో 3ను కచ్చితంగా అమలు చేస్తామని చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ అమలుచేయాలని వరహాలదొర కోరారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

సీతానగరం, ఆగస్టు 8: జిల్లా హెల్త్ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం సీతానగరం పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించింది. నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పి.సంధ్యారాణి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ జి.వసంతలక్ష్మి, డీసీఎం ఎం.అర్జునరావులతో కూడిన బృందంలో ఆసుపత్రిలో క్షేత్రస్థాయిలో, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, అంగన్‌వాడీ పిల్లలకు, బడిలోను, బడిబయట పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొంతమంది గర్భిణులను, బాలింతలను, పిల్లలను ప్రత్యక్షంగా మౌఖికంగా ప్రశ్నించి విషయాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవీకే చైతన్య, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎస్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ దైవకృప, ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బిక్కవోలులో ఆక్రమణల తొలగింపు

బిక్కవోలు, ఆగస్టు 8: బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో చెరువుగట్టు ఆనుకుని అనుమతులు లేకుండా నిర్మించిన రెండు షాపులను గురువారం పంచాయతీ వారు పోలీసుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ గరగ వెంకట్రాజు, సిడం ప్రకాశం పంచాయతీ అనుమతుల్లేకుండా షాపులు నిర్మించారని, వీరిని తొలగించుకోవాలని ఎన్నిమార్లు చెప్పినా వినలేదన్నారు. చివరకు కోర్టు ఉత్తర్వులు మేరకు తొలగిస్తున్నామన్నారు. సీఐ శివగణేష్, ఎస్ఐ పి.బుజ్జిబాబు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అయితే సిడం ప్రకాశం తన కుటుంబసభ్యులతో వచ్చి తాను ఎన్నో యేళ్లగా ఇక్కడ వ్యాపారం చేసుకుంటూ బ్రతుకుతున్నానని, ఈషాపును పడగొడితే కుటుంబాన్ని ఎలా పోషించాలంటూ షాపులో బైటాయించారు. పోలీసులు వారిని బయటకు తీసుకువచ్చి షాపును జేసీబీతో తొలగించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

నన్నయ వర్శిటీ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్‌వోడీ ఉదయ్‌భాస్కర్

దివాన్‌చెరువు, ఆగస్టు 8: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎన్.ఉదయ్‌భాస్కర్ అన్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలోని బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం- కెరీర్ మార్గదర్శకత్వంపై గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు మంచి నడవడికను, ఆలోచనా సరళిని, అలవాట్లను, మిత్రులను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నేటి నుంచి హర్ ఘర్ తిరంగా

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8: జిల్లాలో ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజల్లో దేశభక్తి భావన పెంపొందించాలన్నారు.దీనిలో భాగంగా జిల్లాలోని అధికారులు, సిబ్బందితో సహా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కడియం పూల మార్కెట్‌కు కళ
గడ్కరీని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే
అదుపుతప్పిన ప్రైవేటు బస్ 8

గోదారి గట్టుపై సెట్టుండాలి!

చెట్టును బతికించేందుకు పూజలు.. సందర్శించిన వంశీ

కొవ్వూరు,ఆగస్టు 8: సినిమా చెట్టును బతికించుకునేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.. కొవ్వూరు మండలం కుమారదేవంలో గత ఆదివారం గోదావరి గట్టుపై ఉండే సినిమాచెట్టు (నిద్రగన్నేరు) నేల కొరిగింది.ఈ చెట్టు కింద ఇప్పటి వరకూ సుమారు 300 వరకూ సినిమాలు తీశారు. దీంతో ఈ చెట్టుకు సినిమా చెట్టుగా పేరొచ్చింది.ఈ నేపథ్యంలో ఎక్కడెక్కడి నుంచో చెట్టును బతికించాలని విన్నపాలు రావడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఇదిలా ఉండగా సినీ దర్శకుడు వంశీ గురువారం పడిపోయిన చెట్టును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎలాగైనా బతికించాలని విజ్ఞప్తి చేశారు.రాజమహేంద్రవరం రోటరిక్లబ్ ఆఫ్ ఐకాన్ బృందం సభ్యులు చెట్టును బతికిస్తామని రంగంలోకి దిగారు. క్లబ్ సభ్యుడు ఇమ్మణి వెంకట్ మాట్లాడుతూ పడిపోయిన చెట్టు వేర్లు కట్‌చేసి స్పెషల్ ట్రీట్‌మెంటు చేస్తాం. ప్రకృతిపై ప్రేమతో పనులు చేపడుతున్నామన్నారు. సినిమాచెట్టును 45 నుంచి 60 రోజుల్లో శాస్త్రీయ విధానంలో నిలబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.ఈ మేరకు గురువారం చెట్టు వద్ద పూజలు చేశారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ కుమారదేవంలో పడిపోయిన చెట్టును శాస్త్రీయంగా ఆర్గానిక్ రసాయనాలతో మరలా నిలబెట్టి బతికిస్తామని రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ బృందం ముందుకు వచ్చిందన్నారు. 60 రోజుల్లో చెట్టును నిలబెడతామని తెలిపారన్నారు. కొవ్వూరు డివిజన్‌లో ఇంకా పెద్ద పెద్ద ఫేమస్ ట్రీలు ఉన్నాయని, వాటన్నింటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రోటరిక్లబ్ సభ్యులు దుర్గాప్రసాద్, క్లబ్ సెక్రటరి ఉదయగిరి సురేష్, జాయింట్ సెక్రటరీ వంశీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, కె.శేషగిరి, గొరిజాల సురేష్, వంకా వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేలవాలిన సినిమా చెట్టు వద్ద గ్రామస్తులు

చెట్టు చూసేందుకు వచ్చిన సినీ దర్శకుడు వంశీ

17 మంది తహశీల్దార్ల నియామకం

- ఉత్తర్వులు విడుదల చేసిన కలెక్టర్ ప్రశాంతి
- తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశం

రాజమహేంద్రవరం,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మండలాలకు తహశీల్దార్ల నియామకాలు పూర్తయ్యాయి. ఎన్నికల విధుల నిమిత్తం వేరే జిల్లాలకు వెళ్లిన తహశీల్దార్లు ఇటీవల రిలీవై ఇక్కడ రిపోర్టు చేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల కిందటే తహశీల్దార్ల నియామకం జరగాల్సి ఉంది. కానీ వరదలు, భారీ వర్షాల వల్ల ఇక్కడ విధుల్లో ఉన్నవారిని కదిపితే సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందనే కారణంతో ఆపారు. జిల్లాలో మొత్తం 17 మందిని నియమిస్తూ గురువారం రాత్రి కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా జీఎల్ఎస్.దేవి నియమితులయ్యారు. కలెక్టరేట్ ఏవోగా పీహెచ్‌జీఆర్ పాపారావు, రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయ ఏవోగా ఎం.సుజాత, కొవ్వూరు సబ్-కలెక్టర్ కార్యాలయ ఏవోగా జీఎస్ఎస్ జవహర్ బాజి, కెఆర్ఆర్‌సీ స్పెషల్ తహశీల్దార్‌గా ఎం.రామకృష్ణ ,కలెక్టరేట్‌లో లాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఎం.మసూద్ అలీ నియమితులయ్యారు. ఇక బిక్కవోలు తహశీల్దార్‌గా డబ్ల్యుఎల్.రమణి, కోరుకొండ తహశీల్దార్‌గా వి.సుస్వాగతం, గోకవరం తహశీల్దార్‌గా వై.సరస్వతి, కడియం తహశీల్దార్‌గా కె.పోసిబాబు, రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్‌గా జేవీఆర్.రమేష్, చాగల్లు తహశీల్దార్‌గా మెరిపే మెరికమ్మ, నిడదవోలు తహశీల్దార్‌గా బి.నాగరాజునాయక్, పెరవలి తహశీల్దార్‌గా డి.అచ్యుత కుమారి, తాళ్లపూడి తహశీల్దార్ వి.రవీంద్రనాథ్, కొవ్వూరు తహశీల్దార్‌గా జి.కనకరాజు, ఉండ్రాజవరం తహశీల్దార్‌గా పీఎన్‌డీ.ప్రసాద్ నియమితులయ్యారు. తక్షణం వీరంతా విధుల్లో చేరవలసి ఉంది.

నేటి నుంచి జల మిషన్ సర్వే

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 8: ఇంటింటా ఈ నెల 9నుంచి 13వ తేదీ వరకు జల మిషన్ సర్వే నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పారిశుధ్యం,తాగునీటి ఫిర్యాదులకు పంచాయితీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెం 1800-233-0544 తో ముంద్రించిన పోస్టరు కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఇంటికి సర్వే బృందాలు వెళ్లి ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందా, ట్యాప్ కనెక్షన్ ఉందా, వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారా అనే సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. శానిటేషన్ సర్వే సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణ తీరును శుక్రవారం రెండు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 66 చోట్ల ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్లు పనిచేయడం లేదని తక్షణం అవి పనిచేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడి ఏ ముఖలింగం, డిపివో డి రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ డి బాలశంకరరావు, డిఆర్‌డిఏ పిడి ఎంవీవీఎస్ మూర్తి, డివిజనల్ పంచాయితీ అధికారి నాగలత తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు డీఎస్పీగా దేవకుమార్



కొవ్వూరు, ఆగస్టు 8: కొవ్వూరు డీఎస్పీగా జి. దేవకుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ వెయిటింగ్ లిస్టులో ఉన్న దేవకుమార్‌ను కొవ్వూరు డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు విడుదల చేశారు. కొవ్వూరు డీఎస్పీగా పనిచేసిన కె.చెంచురామారావును హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం సీసీఎస్ డీఎస్పీ కె. శ్రీనివాసమూర్తిని ఇన్‌చార్జిగా నియమించారు.ఇటీవల బదిలీల్లో శ్రీనివాసమూర్తిని బదిలీచేసి జి. దేవకుమార్‌ను కొవ్వూరు డీఎస్పీగా నియమించారు.

టీడీపీలో చేరిన బొమ్మన జయకుమార్

రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వస్త్రవ్యాపారి, జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కనకం నాగేశ్వరరావు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమక్షంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు.ఒకప్పుడు బొమ్మన కుటుంబం టీడీపీతోనే ఉండేది. అయితే దివంగత బొమ్మన రాజకుమార్ వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.ఆ తర్వాత ఈ కుటుంబం వైసీపీతోనే ఉంది.ప్రస్తుతం జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా బొమ్మన జయకుమార్ వ్యవహరిస్తున్నారు.ఈ నెల 25న బ్యాంక్ ఎన్నికలు జరగనున్నాయి.తిరిగి ఆయన ఛైర్మన్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన తండ్రి రాజకుమార్ మూడు దఫాలు జాంపేట బ్యాంక్ ఛైర్మన్‌గా వ్యవహరించారు.ఆయన అకాల మృతితో జయకుమార్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి ఆయనే ఛైర్మన్‌గా ఉన్నారు.



- రసవత్తరంగా ఎస్ఎంసీ ఎన్నికలు
- కూటమి మద్దతుదారులదే పైచేయి
- జిల్లా వ్యాప్తంగా 989 పాఠశాలలు
- 968 స్కూల్స్‌లో ఎన్నికల నిర్వహణ
- 900 పాఠశాలల్లో ఏకగ్రీవం
- 10 స్కూల్స్‌లో వాయిదా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి జోరు తగ్గలేదు.. ఎక్కడా వెనకడుగు వేయలేదు.. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి జోరు కనిపించిందో..ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల్లోనూ అదే జోరు కనిపించింది.విజయపతాకం ఎగురవేసింది. జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ఓటర్లయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా ఓట్లు వేశారు. కొందరు కమిటీకి ఎన్నికయ్యారు. కేవలం కొద్ది చోట్ల మాత్రం స్పందన సరిగా లేదు. జిల్లాలో మొత్తం 989 స్కూళ్ల ఉండగా 968 చోట్ల ఎన్నికలు జరిగాయి. ఇందులో సుమారు 900 వరకూ ఏకగ్రీవమైనట్టు చెబుతున్నారు. ఇంకా పూర్తి సమాచారం రావలసి ఉంది. 10 స్కూళ్లలో క్వారమ్ లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. 11 ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాలు ఎన్నికలు వద్దని కోర్టుకు వెళ్లడం వల్ల అక్కడ నిలిచిపోయాయి. ప్రభుత్వం స్కూళ్ల అభివృద్ధి పై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో పాఠశాలల పనుల నిర్వహణలో తల్లిదండ్రుల పాత్ర ఉండేలా చేయడానికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకుంటున్నారు. ప్రతి స్కూల్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, మరో ఇద్దరు ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. మొదట పాఠశాలలో ప్రతి క్లాస్‌కు ఎన్నికలు జరుగుతాయి. విద్యార్థి తల్లిగాని, తండ్రికాని, సంరక్షకుడుగాని ఓటరుగా ఉంటారు. వీరు క్లాస్ కమిటీని ఎన్నుకుంటారు. తర్వాత అన్ని క్లాస్‌ల కమిటీ సభ్యులు కలసి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీని ఎన్నుకుంటారు. ఆయా సభ్యులంతా కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. కమిటీలో ఎస్సీ, బీసీ, ఓసీ మూడు వర్గాల నుంచి సభ్యులు ఉంటారు. చైర్మన్ మహిళ అయితే, వైస్ చైర్మన్ పురుషుడు ఉంటారు. ఇలా ఒక పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ప్రతి స్కూల్‌లోనూ 50 శాతం ఓటర్ల కంటే ఎక్కువ వస్తే ఎన్నిక నిర్వహించారు. 10 చోట్ల 50 శాతం కంటే తక్కువ రావడంతో ఎన్నిక నిలిపివేశారు. స్కూల్ కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు.వారిలో ప్రధానోపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుడు, పాఠశాల పరిధిలోని వార్డు సభ్యుడు,అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, డ్రాక్వా సంఘం అధ్యక్షురాలు సభ్యులుగా ఉంటారు. ఇంకా ఆయా గ్రామాల్లో ఒక విద్యావేత్త, ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కూడా సభ్యుడిగా ఉంటారు. ఇలా జరిగిన ఎన్నికలు రసవత్తంగా జరిగాయి. కొందరు ముందు గానే పోటీ చేయడానికి రాగా..కొన్ని చోట్ల వచ్చిన వారిలోనే ఎంపిక చేసి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణకు పరిశీలకుడు వచ్చారు. కూటమి మద్దతుదారులే ఎన్నికవడం విశేషం.

మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయండి

వైద్య ఆరోగ్య శాఖ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 : మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకుపై కడుతున్న అదనపు నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతిపై ఏపీఎస్ఎంఐడీసీ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఫస్టియర్ చదువుతున్న మెడికోలు సెకండియర్‌లోకి వెళతారని, కౌన్సెలింగ్ పూర్తయితే త్వరలోనే మరో బ్యాచ్ ఫస్టియర్ మెడికోలు వస్తారని, దీనికి అనుగుణంగా కళాశాల,హాస్టల్ భవనాలు సిద్ధం చేయాలన్నారు. ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మిజీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మెడికల్ కళాశాల పనులపై ఆరా తీస్తున్న కృష్ణబాబు

తల్లిపాలు తాగితే ఐక్యూ లెవెల్స్ అధికం

జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి

నిడదవోలు, ఆగస్టు 8 : తల్లిపాలు తాగిన పిల్లల్లో ఐక్యూ లెవల్స్ అధికంగా ఉంటాయని.. తల్లిపాల ద్వారా అన్ని పోషకాలు బిడ్డకు చేరుతాయని జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి అన్నారు. నిడదవోలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి బాలింత డబ్బా పాలను వదిలి తల్లిపాలు ఇవ్వాలన్నారు. డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టాలన్నారు. లయన్స్ జిల్లా సేవా కో ఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరరావు 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి బేతిన వెంకట రామన్, బండి రామ్ గోపాల్, బండి వెంకటేశ్వరావు, జాస్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి పొగాకు సాగు వద్దు

పొగాకుబోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్

దేవరపల్లి/ గోపాలపురం, ఆగస్టు 8 : రైతులు పొగాకుబోర్డు పరిమితి మేరకే పంటపడించాలని పొగాకుబోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లి పొగాకుబోర్డులో పొగాకుపంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంట సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రపంచ పొగాకు మార్కెట్‌లో మన ప్రాంత పొగాకుకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ ఏడాది జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందని మన దేశంలో పొగాకుకు మంచి ధర పలికిందన్నారు. అనుకూలంగా ఉన్న నేలల్లోనే పంట వేయాలని రైతులకు సూచించారు.ప్రపంచంలో పొగాకు పంట నియంత్రణకు భారతదేశం కూడా ఒప్పంద సంతకం చేసిందని దాన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకు పంటను తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా రైతులు సాగు చేయాలన్నారు.కర్ణాటకలో కూడా ఈ ఏడాది అధికంగా పొగాకు పంట వేశారని గుర్తు చేశారు.పొగాకు బోర్డు ఆర్ఎం పీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ బోర్డు పరిమితి కంటే ఎక్కువ పొగాకు సాగు చేస్తే రైతులపై చర్యలు తప్పవన్నారు. గోపాలపురంలోని పొగాకు బోర్డును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, రైతు సంఘం అధ్య క్షుడు ఇల్లూరి రాము తదితర రైతులు ఉన్నారు.

ముంచెత్తిన వాన



నీట మునిగిన కడియం ఆవ పొలాలు

- మునిగిన చేలు
- పల్లపు ప్రాంతాలు జలమయం

రాజమహేంద్రవరం రూరల్ , ఆగస్టు 8 : భారీ వర్షానికి పంట చేలు మునిగాయి. కడియం ఆవ ప్రాంతంలో రాజవోలు గ్రామం రైతులకు చెందిన సుమారు 350 ఎకరాల్లో వరిపంట ముంపునకు గురైంది. బొమ్మూరు, నామవరం హుకుంపేట, పాత బొమ్మూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు రాజవోలు మీదుగా కడియం ఆవ ప్రాంతంలో గల మురుగు కాలువ ద్వారా వెళుతుంది. కడియం మండలానికి చెందిన కొంత మంది మురుగునీరు వెళ్లకుండా డ్యామ్ వద్ద నిలిపివేయడంతో రాజవోలు గ్రామంలో వరి పంట మునిగిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కారవేదికలో అర్జీ పెట్టుకున్నామని రైతులు తెలిపారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే మురుగునీటి కాలువతో తమకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పంటను ముంపు బారి నుండి తప్పించేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీతానగరం..జలమయం

సీతానగరం, ఆగస్టు 8 : సీతానగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయంగా మారిపోయాయి. శెట్టిబలిజపేట ,సీతానగరం-పురుషోత్తపట్నం రోడ్డు, సీతానగరం పాత బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళే మార్గం ముంపునకు గురయ్యాయి. సీతానగరం బస్టాండ్ వద్ద నున్న కుమ్మరి గొయ్యి నిండిపోయింది. ఆ గొయ్యిలోకి నీరు వెళ్లే అవకాశం లేక సమీపంలో ఉన్న శెట్టిబలిజపేట, పురుషోత్తపట్నం ప్రధాన రహదారి ముంపునకు గురయ్యాయి, పరిస్థితి గమనించిన కూటమి నాయకులు గురువారం హుటాహుటిన ఎక్స్‌కవేటర్ల సాయంతో పూడుకుపోయిన పాత తూరలు తొలగించి వెలమపేట వైపు నీరు మళ్లించారు.దీంతో వెలమపేట వైపున ఉన్న లేఅవుట్‌లోకి నీరు ప్రవేశించి అక్కడ ఇళ్లను మురుగునీరు చుట్టుముట్టింది. దీంతో ముంపునకు గురైన బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. శెట్టిబలిజ పేట వాసులు ఊపిరిపీల్చుకోగా వెలమపేటలో ముంపునకు గురైన బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాళ్లపూడిలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8 : జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.గురువారం తెల్లవారుజాము 2 గంటల నుంచి ఉదయం 8:30 గంటల మధ్య జిల్లా వ్యాప్తంగా 1147.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా తాళ్లపూడి మండలంలో 126.0 మి.మీ..అత్యల్పంగా పెరవలి మండలంలో 7.8 మి.మీ వర్షం పడింది.రాజమహేంద్రవరం డివిజన్ సీతానగరంలో 114.4మి.మీ., కోరుకొండ 90.4,రాజానగరం 82.4, గోకవరం 80.0, బిక్కవోలు 79.2, కడియం 78.2,రంగంపేట 77.4,రాజమహేంద్రవరం రూరల్ 69.2,అనపర్తి 66.8,రాజమహేంద్రవరం 62.2 మి.మీ వర్షపాతం నమోదైంది.కొవ్వూరు డివిజన్ గోపాలపురంలో 54.6 మి.మీ.కొవ్వూరు 40.4, నల్లజర్ల 35.4, దేవరపల్లి 32.0, చాగల్లు 24.4,నిడదవోలు 17.2,ఉండ్రాజవరం 9.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 60.4 శాతం వర్షం కురిసింది.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం,ఆగస్టు 8 : ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది.ధవళేశ్వరం వద్ద గురువారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 9.50 అడుగులుగా నమోదుకాగా 6,88,383 క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఇంద్రావతి పరీవాహకంలో కురిసిన వర్షాలతో పాటు తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటితో భద్రాచలం వద్ద 38.40 అడుగుల వరకు చేరిన నీటిమట్టం తగ్గుతూ 37.30 అడుగులకు చేరుకుంది.

కొవ్వాడ కాల్వకు వరద పోటు..

గోపాలపురం, ఆగస్టు 8 : గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొవ్వాడ కాల్వకు వరద పోటెత్తింది. బుధవారం సాయంత్రానికే వరదనీరు ప్రవాహం దొండపూడి - సాగిపాడు గ్రామాల మధ్య కాజ్‌వేపైకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీస్,రెవెన్యూ అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో కొయ్యలగూడెం నుంచి పోలవరం వైపు గిరిజన గ్రామాలకు వెళ్లే వారందరికీ రాకపోకలు బంద్ అయ్యాయి. సుమారు 10 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.గురువారం ఉదయానికి ప్రవాహం ఉధృతమైంది. కొవ్వూరుపాడు, సాగిపాడు గ్రామాల మధ్య ఉన్న అల్లి కాల్వకు వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచి పోయాయి.



తాళ్లపూడిలో నీట మునిగిన రోడ్డు



సీతానగరం మెయిన్‌రోడ్డుపై నిలిచిన వాన నీరు



దొండపూడి - సాగిపాడు గ్రామాల మధ్య కాజ్‌వే పై కొవ్వాడ వరద నీరు

రహదారుల సమస్య తీర్చండి

ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



ఢిల్లీలో ఆర్‌అండ్‌బీ మంత్రి నితిన్ గట్కారిని కలిసి రహదారుల పరిస్థితిపై వివరిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 8: రహదారుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. కేంద్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని గురువారం కలిసి జిల్లాలో సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన విలేకరులకు ఫోన్‌లో వివరాలు తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గుండుగొలను- కొవ్వూరు జాతీయ రహదారి పరిస్థితులతో పాటు జీలుగుమిల్లి -కొవ్వూరు జాతీయ రహదారి నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన నివేదికను సమర్పించినట్టు తెలిపారు. గుండుగొలను- కొవ్వూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న దుద్దుకూరు జాతీయ రహదారితో పాటు దుద్దుకూరు, లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు, త్యాజంపూడి మీదుగా యర్నగూడెం జాతీయ రహదారికి అనుసంధానం చేసే కూడలి వరకు పటిష్టమైన రహదారి నిర్మించాలని కోరామన్నారు. దేవరపల్లిలో ప్రారంభమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే జంక్షన్‌తో పాటు జీలుగుమిల్లి నుంచి దొండపూడి మీదుగా కొవ్వూరు జాతీయ రహదారి నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్ర మంత్రికి అందించామన్నారు. దొండపూడి ప్రధాన సెంటర్‌లో రోడ్డు నిర్మాణం కుదించాలని గడ్కరీని కోరినట్టు తెలిపారు. నివేదికలను పరిశీలించిన అనంతరం మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



ఉప్పలపాటి సుబ్బారావు

పెరవలి, ఆగస్టు 8: మండలంలో ఉసులుమర్రు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉప్పలపాటి సుబ్బారావు (102) గురువారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన భార్య రామలక్ష్మి, ఓ కుమారుడు సత్తిరాజు, నలుగురు కుమార్తెలు, 11మంది మనుమలు, 18మంది మునిమనుమలు ఉన్నారు. సుబ్బారావు గ్రామానికి మంచినీటి సౌకర్యం లేని రోజుల్లో చెరువును తవ్వించడంతోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఆయన మృతి పట్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, తదితర టీడీపీ, జనసేన పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొవ్వూరు, ఆగస్టు 8: కొవ్వూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. కొవ్వూరులోని గౌతమీనగర్, ఫ్యాక్టరీరోడ్, మెయిన్‌రోడ్, జూనియర్‌కాలేజ్, శ్రీనివాసపురం, క్రిస్టియన్‌పేట, రాజీవ్‌కాలనీలకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బంధపురం, రామన్నపాలెం, బుచ్చయ్యపాలెం, బేచర్ల పరిధిలో ఉన్న త్రివేణి ఫీడర్‌కు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ వీరభద్రరావు తెలిపారు.

చాగల్లు తహశీల్దార్‌గా మెరికమ్మ



చాగల్లు, ఆగస్టు 8: చాగల్లు మండల తహశీల్దార్‌గా ఎం.మెరికమ్మను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె అమలాపురం తహశీల్దార్‌గా పనిచేశారు. గతంలోను ఆమె చాగల్లులో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎం.సావిత్రి రంపచోడవరం బదిలీ అయ్యారు.

కొవ్వూరు తహశీల్దార్‌గా కనకరాజు



కొవ్వూరు, ఆగస్టు 8: కొవ్వూరు మండల తహశీల్దార్‌గా కనకరాజును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయ డివిజనల్ పరిపాలనాధికారిగా జీఎస్ఎస్ జవహర్ బాజి, కేఆర్‌సీ తహశీల్దార్‌గా ఎం.రామకృష్ణ, కొవ్వూరు తహశీల్దార్‌గా జి.కనకరాజులను నియమిస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు కొవ్వూరు తహశీల్దార్‌గా పనిచేసిన కె.మస్తాన్‌ను కృష్ణా జిల్లా బదిలీ చేశారు.

ఏబీఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు

కొవ్వూరు, ఆగస్టు 8: కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, జీఎస్టీ సూపరింటెండెంట్ బి.రవిచంద్ర ప్రారంభించారు. తలసేమియా బాధితుల సహాయార్థం జీఎస్టీ విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 43 మంది రక్తదానం చేసినట్టు సుబ్బారావు తెలిపారు. రక్తదానంపై అపోహలను తొలగించేందుకు కళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది రామ్‌మోహన్, ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, పీడీ పి.మురళీధర్, కె.సూరిబాబు, బి.సత్యనారాయణ, బి.మాధురిదేవి, వల్లవికుమారి పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు, ఆగస్టు 8: నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం పంపిణీచేశారు. కారింకి సంపత్‌సత్య వరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కోటిపల్లి పండు, కేదారిశెట్టి రవికుమార్, చిక్కాల రాజా, ఎస్‌వీ సుబ్బారావు, గిద్దా వేణు, సత్యసాయి సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు

అసంఘటిత కార్మికులకు భరోసా కరువు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిడదవోలు, ఆగస్టు 8: ఉపాధి కల్పించడంలో పాలకుల వైఫల్యం కారణంగా స్వయం ఉపాధి పొందుతున్న వారికి భరోసా కరువైందని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు పామర్తి సత్య అన్నారు. గురువారం నిడదవోలులో ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ గౌతమి ఎలక్ట్రికల్ అండ్ ఎలాక్ట్రానిక్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పంగిడి రోడ్డు లోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈమని గ్రీష్మకుమార్, మల్లిడి వెంకట రామిరెడ్డి, మహ్మద్ అలీ, వెలిగట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

రంగంపేట, ఆగస్టు 8: తల్లిపాలు అమృతంతో సమానమని రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముర్రిపాలు ఆవశ్యకత, దానిలోని పోషక విలువలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు సంకీర్తన, చిన్నారావు, సీహెచ్‌వో కె.జయమణి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి ఎస్‌ఐగా సుబ్రహ్మణ్యం



దేవరపల్లి, ఆగస్టు 8: దేవరపల్లి ఎస్‌ఐగా వి.సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు గురువారం స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌ఐగా చేసిన శ్రీహరి రావు కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ బదిలీపై వెళ్లగా తాడేపల్లిగూడెం ట్రాఫిక్ ఎస్‌ఐగా చేస్తున్న సుబ్రహ్మణ్యంను దేవరపల్లికి నియమితులయ్యారు. చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడిపందాలు, సారా తయారీపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్‌ఎంసీలు కూటమి కైవసం

- పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు
- కూటమి అభ్యర్థులే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నిక

గోపాలపురం, ఆగస్టు 8: ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి సభ్యులు ఘన విజయం సాధించారు. పలు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండలంలో 18 పంచాయతీల పరిధిలో 32 గ్రామాల్లో 53 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆయా గ్రామాల్లో ఇటు కూటమి నాయకులు, అటు తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్యనభ్యసించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు భరోసా కల్పించడంతో తల్లిదండ్రులంతా ఏకతాటిపై వచ్చి మండలంలో 53పాఠశాలలకు గాను 50పాఠశాలల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. భీమోలు, కొవ్వూరుపాడు, గంగోలు గ్రామాల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశారు. కాగా నియోజకవర్గంలోని 318 పాఠశాలలకు గాను 315 పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం మద్దతిచ్చిన అభ్యర్థులు ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

చాగల్లు: మండలంలోని 38 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా 22 చోట్ల చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా 16 పాఠశాలలో ఎన్నికలు జరిగాయని ఎంఈవో యు.గురునాథం పేర్కొన్నారు. ఆయా పాఠశాలలకు 563 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు కలిగిన చాగల్లు హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా కె.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు.

నల్లజర్ల: నల్లజర్ల జడ్పీ హైస్కూల్లో జరిగిన ఎన్నికల్లో విద్యా కమిటీ సభ్యులు చైర్మన్‌గా కోడూరి నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు హెచ్‌ఎం కోమల చిత్ర తెలిపారు. వైస్ చైర్‌పర్సన్‌గా బాణాల లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులుగా సవలం కామకృష్ణ, గణపవరపు వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. అనంతర ప్లస్ టూ చదువుతున్న విద్యార్థులకు వెంకటేశ్వర క్లాత్ షోరూం అధినేత రాయుడు అప్పారావు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో కాపు సంఘం కన్వీనర్ ఉన్నమట్ల సత్యకిరణ్,చింతా చైతన్య, కటారి సాయితేజ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. కాగా అన్నదేవరపేట పాఠశాలలో జరిగిన కమిటీ ఎన్నికలు పంచాయతీ ఎన్నికల మాదిరిగా జరిగాయి. మండలంలో ఎన్నికలను పర్యవేక్షించాల్సిన తహశీల్దార్, ఎంపీడీవో, పోలీసులు సైతం గ్రామంలోనే వేచి ఉన్నారు. ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసాయి. చైర్మన్‌గా గెలిచిన ఉప్పే బంగారం, వైస్ చైర్మన్ మరపట్ల చిన్నారిలను టీడీపీ నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి తదితరులు పూలమాలలో సత్కరించి అభినందించారు. తాళ్లపూడిలో గెలుపొందిన కమిటీని టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు అభినందించారు. కాగా మలకపల్లిలో వైసీపీకి చెందిన వ్యక్తి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

దేవరపల్లి: మండలంలోని 34 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలలో, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవోలు ఎస్.తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. ఎనిమిది ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, మూడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని, మిగిలిన అన్ని పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. దేవరపల్లిలో ఏఎంసీ చైర్మన్లుగా ఎన్నికైన వారిని టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు అభినందించారు.



చాగల్లు హైస్కూల్లో జరిగిన ఎన్నికలో పాల్గొన్న తల్లిదండ్రులు



గోపాలపురం హైస్కూల్లో ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీ సభ్యులు



తాళ్లపూడి: అన్నదేవరపేటలో ఎస్ఎంసీ చైర్మన్‌ను అభినందిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో విద్యా కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు



నల్లజర్లలో కళాశాల విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న దృశ్యం

నిడదవోలు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.11 కోట్లు

- పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలు, పెరవలిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



నిడదవోలు: డి.ముప్పవరం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి దుర్గేష్

నిడదవోలు/పెరవలి/ఉండ్రాజవరం, ఆగస్టు 8: నిడదవోలు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం, గోపవరం, పురుషోత్తపల్లి, డి.ముప్పవరం, పందలపర్రు, పెరవలి మండలం కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, తీపర్రు, ఉండ్రాజవరం మండలం పాలంగి, కె.సావరం, చివటం, వడ్లూరు, సూర్యారావుపాలెం గ్రామాల్లో అంతర్గత రహదారి పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.11 కోట్లు మంజూరు చేసిందని, దీంతో గ్రామాల్లో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అధికార్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థపై కూడా దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ ఆలీముల్లా, డీఈఈ కె.రామ్మోహన్, ఏఈ సీహెచ్ఆర్‌కే శాస్త్రి, ఎంపీడీవోలు జేఏ ఝాన్సీ, హిమమహేశ్వరి, పెరవలిలో భూపతిరాజు రవివర్మ, ఆతికాల రామకృష్ణమ్మ, వాకలపూడి వీర్రాజు, సీహెచ్ వెంకటనారాయణ, హనుమంతు సుబ్రహ్మణ్యం, పిప్పర రవి, పత్తిపాటి ప్రసాద్‌కుమార్, నందమూరి నారాయణరావు, మొగళ్లపు సీతారామ్, సింహాద్రి సత్యనారాయణ, ఉండ్రాజవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, జీవీ సుబ్రహ్మణ్యం, కాకర్ల కరుణాకర్, కాకర్ల నాని, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, పీఆర్ డీఈఈ కె.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణం పనులు చేపట్టాలి

నిడదవోలు-నరసాపురం కాలువపై తీపర్రు వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు జారిపడడంతో పది రోజులు క్రితం మంత్రి దుర్గేష్ దృష్టికి గ్రామస్థులు ఈ విషయాన్ని తీసుకొచ్చారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి వెంటనే ఇక్కడ ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే ఈ విషయమై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 'మంత్రి చెప్పినా పట్టించుకోరా' శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన మంత్రి మళ్లీ వంతెన ప్రదేశాన్ని పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి తక్షణం పనులు చేపట్టాలని ఆదేశించారు.

పూల మార్కెట్‌కు కళ

మల్లెలు కిలో రూ.1600, చామంతి రూ.300



కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్

కడియం, ఆగస్టు 8: నిన్నటి వరకు మూఢం... అంతంత మాత్రంగా పూల ధరలు. ప్రస్తుతం శ్రావణమాసం అందులోను శుక్రవారం. మరో వైపు వివాహ ముహూర్తాలు ఉండడంతో పూలమార్కెట్‌కు కళ వచ్చింది. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌లో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో బిజీగా మారింది. శ్రావణ శుక్రవారం రోజు అమ్మవారికి పసుపు రంగు చామంతి పూలతో మహిళలు పూజలు చేస్తారు. ఈ పూలను ఈ సీజన్‌లో బెంగుళూరు, మద్రాసు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. సుమారు అక్టోబరు నవంబరు మాసాల వరకు చామంతిపూలు మాత్రం ఇతర ప్రాంతాల నుంచే దిగుమతి చేసుకుంటారు.

పూలధరలు (కిలో)..

చామంతి: రూ.250-రూ.300
నీలం చామంతి: రూ. 250
బంతి:రూ. 70-రూ. 80
లిల్లీ: రూ.350
కాగడాలు: రూ.800
జాజులు: రూ.1,100
మల్లెలు: రూ.1,600
కనకంబరం (1-బారు) రూ.450
స్టార్‌గులాబీ: రూ.150-రూ.170

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

దివాన్‌చెరువు, ఆగస్టు 8: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలదొర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్ణయం మేరకు 30 ఏళ్లుగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. దేశంలోని ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఆగస్టు 9న ప్రభుత్వ సెలవు దినంగా అమలు అవుతోందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో కూడా సెలవుగా ప్రకటించాలని రెండు ప్రభుత్వాలను తాము కోరుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకు మాత్రమే ఉద్యోగాలు కల్పించాలన్న జీవో 3ను కచ్చితంగా అమలు చేస్తామని చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ అమలుచేయాలని వరహాలదొర కోరారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది



సీతానగరం పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

సీతానగరం, ఆగస్టు 8: జిల్లా హెల్త్ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం సీతానగరం పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించింది. నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పి.సంధ్యారాణి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ జి.వసంతలక్ష్మి, డీసీఎం ఎం.అర్జునరావులతో కూడిన బృందంలో ఆసుపత్రిలో క్షేత్రస్థాయిలో, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, అంగన్‌వాడీ పిల్లలకు, బడిలోను, బడిబయట పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొంతమంది గర్భిణులను, బాలింతలను, పిల్లలను ప్రత్యక్షంగా మౌఖికంగా ప్రశ్నించి విషయాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవీకే చైతన్య, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎస్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ దైవకృప, ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాపను ఇప్పించండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- తూర్పుగోనగూడెంలో విచారణ చేపట్టిన అధికారులు



తూర్పుగోనగూడెం సచివాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

రాజానగరం, ఆగస్టు 8: నవ మాసాలు మోసి ప్రసవించిన తన బిడ్డను తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలో ఆలస్యంగా వెలుగు చూసింది. 2019లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ పీడీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొర్రపు ఆదిలక్ష్మి 2019 అక్టోబరు 30న రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఆడ శిశువును ప్రసవించింది. ఆసుపత్రిలో ఉండగా వారం రోజుల అనంతరం తన భర్త అప్పారావుకు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగించి తన బిడ్డను తీసుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయబోతే స్వీకరించలేదని బాధిత మహిళ వాపోయింది. ఈ విషయమై తనకు ప్రసవం చేసిన వైద్య సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదన్నారు. దీనిపై భర్త అప్పారావు మాట్లాడుతూ పాపను పెంచుకోలేరని, తమకు ఇస్తే కొంత నగదు ముట్టచెబుతామని చెప్పడంతో మద్యం మత్తులో తన పాపను వారికి అప్పగించినట్టు చెప్పాడు. పాపను తిరిగి తీసురమ్మని తన భార్య ఒత్తిడి తీసుకురాడమే కాకుండా పోలీసు కేసు పెడతానని బెదిరించడంతో భయపడి ఊరు వదిలి వెళ్లిపోయానని, ఏడాది అనంతరం పోలీసులు ఎవరూ రావడం లేదని తెలుసుకుని తిరిగి ఇంటికి చేరుకున్నట్టు చెప్పాడు. తన పాపను కష్టపడి పెంచుకుంటామని ఇప్పుడు ఎలాగైనా తిరిగి తమకు అప్పగించాలని ఆదిలక్ష్మి, అప్పారావు విలపించారు. ఈ విషయమై విచారణాధికారిణి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారిని విలేకరులు ప్రశ్నించగా ఈ సంఘటనకు సంబంధించి బాధితుల నుంచి సమగ్ర సమాచారం సేకరించామని, కలెక్టర్‌కు నివేదిస్తామని బదులిచ్చారు. అయితే విచారణాధికారుల ఆదేశాల మేరకు బాధితులు గురువారం రాత్రి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ విచారణలో డిప్యూటీ తహశీల్దార్ సునీత, ఏఎస్‌ఐ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు

ప్రయాణికులు సురక్షితం





దివాన్‌చెరువు సమీపంలో తుప్పల్లోకి దూసుకెళ్లిన బస్సు

రాజమహేంద్రవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. హైవేపై దూసుకుపోతోంది. సరిగ్గా అర్ధరాత్రి 1.30 సమయం..వర్షం కురుస్తోంది.. దాదాపు అందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఈలోపు పెద్ద కుదుపు.. బస్సు అదుపుతప్పింది.. ప్రయాణికుల హాహాకారాలు.. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కేవీఆర్ ట్రావెల్స్‌కి చెందిన బస్సు గుంటూరు నుంచి పాల కొండ వెళుతోంది. వర్షం పడుతుండడంతో రోడ్డు చిత్తడిగా మారింది. దివాన్ చెరువు సమీపంలోని హైవేకి చేరే మలుపు వద్ద బస్సు అదుతప్పి రోడ్డు పక్కకు తుప్పల్లోకి వెళ్లింది. డ్రైవరు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వి.వినయ్‌మోహన్, ప్రకాశ్‌నగర్ ఎస్‌ఐ శివప్రసాద్, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. కేవీఆర్ ట్రావెల్స్ స్థానిక కార్యాలయం నుంచి కూడా సిబ్బంది వచ్చారు. 40మంది ప్రయాణికులను జాగ్రత్తగా కిందికి దించి వేరే బస్సులో సురక్షితంగా పంపించారు.

బిక్కవోలులో ఆక్రమణల తొలగింపు

బిక్కవోలు, ఆగస్టు 8: బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో చెరువుగట్టు ఆనుకుని అనుమతులు లేకుండా నిర్మించిన రెండు షాపులను గురువారం పంచాయతీ వారు పోలీసుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ గరగ వెంకట్రాజు, సిడం ప్రకాశం పంచాయతీ అనుమతుల్లేకుండా షాపులు నిర్మించారని, వీరిని తొలగించుకోవాలని ఎన్నిమార్లు చెప్పినా వినలేదన్నారు. చివరకు కోర్టు ఉత్తర్వులు మేరకు తొలగిస్తున్నామన్నారు. సీఐ శివగణేష్, ఎస్‌ఐ పి.బుజ్జిబాబు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అయితే సిడం ప్రకాశం తన కుటుంబసభ్యులతో వచ్చి తాను ఎన్నో యేళ్లుగా ఇక్కడ వ్యాపారం చేసుకుంటూ బ్రతుకుతున్నానని, ఈషాపును పడగొడితే కుటుంబాన్ని ఎలా పోషించాలంటూ షాపులో బైటాయించారు. పోలీసులు వారిని బయటకు తీసుకువచ్చి షాపును జేసీబీతో తొలగించారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై సమాచారం ఇవ్వలేదు

విద్యాశాఖ తీరుపై కమిషనర్‌కు ఫిర్యాదు

కడియం, ఆగస్టు 8: కడియం మండల విద్యాశాఖ తీరుపై విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి వెంకటరామారావు(రాంజీ) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఎంపీపీకి, సర్పంచ్‌కు, ప్రజాప్రతినిధులకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఎన్నికలు జరపాలంటూ 6 పేజీల కాపీలో స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై ఎంఈవోలకు ఫోను చేసినా వారు స్పందించక పోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఉపవిద్యాశాఖాధికారికి ఫోన్ చేశానన్నారు. విద్యాశాఖ తీరుపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు రాంజీ తెలిపారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్

రంగంపేట, ఆగస్టు 8: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో జె.జెస్సీఫ్లోరెన్స్, ప్రజ్వల కోఆర్డినేటర్ టి.శ్రావ్యశ్రుతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు ఉద్యోగం, సినిమా అవకాశాల మోసపోయి విదేశాలకు రవాణా అవుతున్నారన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించి రక్షించాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని అవగాహన కలిగించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మురారి
వై.స్క్రీన్2	తుఫాన్
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	కమిటీ కుర్రోళ్లు
నిడదవోలు	
వీ మ్యాక్స్	బడ్డీ
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	పురుషోత్తముడు
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---